

సోమవారం ఇన్సులిన్ ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్న డీసీఏ అధికారులు


నమస్తే తెలంగాణ


# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 28 మే 2024 | HYDERABAD


## ఈదురుగాలులతో..

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కాగా, అల్పపీడనం కారణంగా గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఆదివారం నగరంలో గరిష్ఠం 40.2 సెల్సియస్‌గా నమోదవ్వగా, సోమవారానికి 2.4 తగ్గి 37.8 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ఠం 27.0 డిగ్రీల సెల్సియస్‌గా, గాలిలో తేమ 46 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



## 'ఇన్సులిన్' విక్రయాల్లో అక్రమాలు

పలు మెడికల్ ఏజెన్సీలపై డీసీఏ కొరడా

ఆరు ఏజెన్సీల లైసెన్స్‌లు రద్దు

సిటీబ్యూరో: ఇన్సులిన్ మందుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడుతున్న మెడికల్ ఏజెన్సీలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.ఈ క్రమంలోనే నగరంలోని ఆరు మెడికల్ ఏజెన్సీల లైసెన్స్‌లను నెల రోజుల పాటు సస్పెండ్ చేశారు.వారి వద్ద నుంచి రూ. 51.92 లక్షల విలువైన ఇన్సులిన్ ఇంజెక్షన్లను సీజ్ చేశారు. డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం....నగరంలో పలు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లు పోటీపడి.. 40 శాతానికి పైగా డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు. దీంతో అనుమానం వచ్చిన డీసీఏ అధికారులు.. మార్చి 15 నుంచి నగరంలోని పలు మెడికల్ ఏజెన్సీలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో నగరంలోని ఆరు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై దాడులు జరిపి, సేల్ బిల్స్‌ను పరిశీలించగా, వాటికి కొనుగోలు చేసిన బిల్లులు లేవని తేలింది. అంతే కాకుండా ఈ మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ ఢిల్లీ నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా తక్కువ ధరకు ఇన్సులిన్ ఇంజెక్షన్లను కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలింది. డీసీఏ నిబంధనల ప్రకారం బిల్లులు లేకుండా ఔషధాలను కొనుగోలు చేయడం డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం 1940 ప్రకారం నేరం. బిల్లులు, సంబంధిత తయారీ కంపెనీకి పత్రాలు లేకుండా అక్రమంగా ఔషధాలు కొనుగోలు చేయడం వల్ల సదరు ఔషధాల నాణ్యత, కచ్చితత్వం ప్రశ్నార్థకంగా ఉంటున్నది. ఇలాంటి మందులు వాడటం రోగులకూ ప్రమాదకరమే. అంతే కాకుండా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును కూడా ఈ మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ యధేచ్ఛగా ఎగ్గోడుతున్నారు. ఈ మేరకు కొన్ని రోజులుగా నగరంలోని మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై నిఘా పెట్టగా, ఆరు మంది మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ అనధికారికంగా ఢిల్లీ నుంచి తక్కువ ధరకు ఇన్సులిన్ ఇంజెక్షన్లను బిల్లులు లేకుండా కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలింది. సోమవారం సికింద్రాబాద్, పద్మారావునగర్‌లోని డ్రగ్ హబ్‌పై దాడులు జరిపి, 6.70 లక్షల విలువైన ఇన్సులిన్ ఇంజెక్షన్లను సీజ్ చేశారు. ఉప్పల్, రామంతాపూర్‌లోని శ్రీ తిరుమల ఫార్మాపై దాడులు జరిపి రూ. 3.52 లక్షల విలువ చేసే ఇన్సులిన్‌ను, సుల్తాన్‌బజార్‌లోని శ్రీ పరాస్ మెడికల్ ఏజెన్సీపై దాడులు జరిపి రూ. 9 లక్షల విలువ చేసే ఇన్సులిన్, నాగోల్, సాయినగర్‌లోని శ్రీగణేశ్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ వద్ద నుంచి రూ.14.లక్షల విలువ చేసే ఇన్సులిన్, కాప్రాలోని శ్రీరాజ రాజేశ్వర డిస్ట్రిబ్యూటర్స్ వద్ద నుంచి రూ. 2.70 లక్షల విలువైన ఇన్సులిన్‌ను, కాచిగూడలోని శ్రీబాలాజీ ఏజెన్సీ నుంచి రూ.16 లక్షల విలువైన ఇన్సులిన్‌లను సీజ్ చేశారు. ఈ ఆరు మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ లైసెన్స్‌లను నెలరోజుల పాటు సస్పెండ్ చేస్తూ డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## ఆపరేషన్‌కు డబ్బులు డిమాండ్

ఆరోపణలపై విచారణ షురూ

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): సర్జరీ చేసేందుకు ఒక వైద్యుడు డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ షురువైంది. గాంధీ దవాఖానలో త్వరగా శస్త్రచికిత్స జరిపేందుకు ఒక వైద్యుడు రోగి వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు వారం రోజుల కిందట దవాఖాన సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. దీనిని సీరియస్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు వచ్చిన ఫిర్యాదుపై నాలుగు విభాగాలకు చెందిన ప్రొఫెసర్లతో కూడిన కమిటీతో విచారణకు ఆదేశించారు. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీ విచారణను ప్రారంభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో విచారణకు సంబంధించిన నివేదికను కమిటీ సూపరింటెండెంట్‌కు సమర్పించనున్నది. నివేదిక ఆధారంగా జరిగిన ఘటనపై డీఎంఈ తదుపరి చర్యలు తీసుకోనున్నారు.



హఫీజ్‌పేట సాయినగర్‌యూత్ కాలనీలో చనిపోయిన చిన్నారి సమద్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే గాంధీ

# 10 లక్షలు పరిహారమివ్వాలి

అకాల వర్షానికి ఒక్కరోజే.. 14 మంది చనిపోవడం బాధాకరం

బాధిత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హఫీజ్‌పేటలో బాధిత కుటుంబాలకు పరామర్శ

లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేత



దెబ్బ తిన్న రేకుల షెడ్డును పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిటీబ్యూరో/ మాదాపూర్ , మే 27, (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షానికి ఒక్కరోజే 14 మంది చనిపోవడం బాధాకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఒక్కో కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల నష్ట పరిహారాన్నీ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. హఫీజ్‌పేట డివిజన్ సాయినగర్ యూత్‌కాలనీలో ప్రమాదవశాత్తు చనిపోయిన వ్యక్తుల కుటుంబాలను సోమవారం కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి పరామర్శించారు. అకాల వర్షానికి రషీద్, బాలుడు సమద్ చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. ఘటన జరిగిన తీరును పరిశీలించి, బాధిత కుటుంబాలను ఓదార్చారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం భద్రత చర్యలు చేపట్టాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టామని, 60 వేల గృహాలను కేటాయించినట్లు చెప్పారు. నిర్వాసితులైన కుటుంబాలకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లను బాధిత కుటుంబాలకు కేటాయించి వారిని ఆదుకోవాలన్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కేటీఆర్ వెంట డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్ గౌడ్, వాలా హరీశ్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## భయపెడుతున్న హోర్డింగ్‌లు!

ఈదురుగాలులతో కొట్టుకొస్తున్న ఫ్లెక్సీలు

విద్యుత్ స్తంభాలపై పడుతున్న వైనం

హోర్డింగ్స్‌ల ఏర్పాటులో నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏజెన్సీలు

బలహీన ఫ్లెక్సీలతో విద్యుత్ శాఖ, స్థానికుల్లో ఆందోళన

నిరంతర పర్యవేక్షణ చేయని బల్దియా

సిటీబ్యూరో, మే 27, (నమస్తే తెలంగాణ) : వర్షాకాలం అంటే అందరికీ వెన్నులో వణుకే...ప్రమాదం ఏ రూపంలో వస్తుందో తెలియని పరిస్థితి. ఇంటి నుంచి బయటకు వచ్చామంటే చాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. నాలాలు, మ్యాన్‌హోల్స్, విద్యుత్ స్తంభాలు, ప్రహరీలు, సెల్లార్ గుంతలు, కరెంట్ తీగలు, కూలిపోయే చెట్లు ఇలా ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. ఈ జాబితాలో హోర్డింగ్స్‌లు వచ్చి చేరాయి. గ్రేటర్‌లో వాణిజ్య ప్రకటనల కోసం ఏర్పాటు చేసే బోర్డులు 15 ఫీట్లకు తగ్గకుండా ఉండాలి. కానీ చాలా చోట్ల కొందరు అధికారుల ప్రమేయంతో నిబంధనలను ఉల్లంఘించి.. హోర్డింగ్‌ల ఎత్తు పెంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మెట్రో కారిడార్ లక్ష్యంగా సికింద్రాబాద్, హైటెక్ సిటీ ఇతర ప్రాంతాల్లో 15 ఫీట్లకు మించి హోర్డింగ్‌లు ఉండటం, ఈ క్రమంలోనే బలహీనమైన ఫ్లెక్సీలు చిరిగిపోయి వాహనదారులను, కరెంట్ స్తంభాలను కప్పేస్తున్నాయి. బలమైన ఈదురుగాలులతో హోర్డింగ్‌లు, కొట్టుకొస్తున్న ఫ్లెక్సీలతో స్థానికులతో పాటు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై పడుతుండటంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతుండటం ఇందుకు నిదర్శనం.

### నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

నగరంలో ఏర్పాటు చేసే హోర్డింగ్స్ ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలిగించకుండా ఉండేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహించాలి. వ్యాపార ప్రకటనతో పాటు హోర్డింగ్ సామర్థ్యం పరీక్షించి సర్టిఫికెట్‌ను జారీ చేయాలి. కానీ ఆ దిశగా తనిఖీలు జరగడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 15 మీటర్ల వరకు ఉన్న హోర్డింగ్‌లు సైతం పక్కాగా.. నిబంధనల ప్రకారం నడపాల్సిన చోట సదరు ఏజెన్సీలు మెట్రో పిల్లర్లే లక్ష్యంగా అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ధనార్జనే ధ్యేయంగా హోర్డింగ్‌ల ఏర్పాటు చేస్తూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. ఈ తరహా సర్దార్ పటేల్ రోడ్ (శివాజీనగర్), సైబర్ సిటీ టవర్, శిల్పారామం రోడ్ ఇలా కొన్ని చోట్ల అర్ధరాత్రి పూట వయా డక్ట్ హోర్డింగ్ పనులు జరుపుతున్నారు. ఈ పనులను పర్యవేక్షించే అధికారులు లేరు. ప్రమాదకర స్థాయిలో ఈ పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బలహీనమైన ఫ్లెక్సీలతో ఇబ్బందులు వస్తున్నాయని గ్రేటర్ విద్యుత్ అధికారులు చెబుతున్నారు. కరెంట్ తీగలపై ఫ్లెక్సీలు పడుతుండటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నదని, ప్రమాదకర హోర్డింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు.

# శక్తివంచన లేకుండా పనిచేయండి

కలుషిత నీరు, మ్యాన్‌హోళ్లపై దృష్టి సారించాలి

పరిస్థితుల పర్యవేక్షణకు సెంట్రల్ సేఫ్టీ ప్రొటోకాల్ సెల్

క్షేత్ర స్థాయిలో మాన్‌సూన్ మేనేజ్‌మెంట్ ప్లాన్

జీహెచ్‌ఎంసీలో డీప్ మ్యాన్‌హోళ్లకు సేఫ్టీ గ్రిల్స్ బిగింపు

జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

వర్షాకాలం ప్రణాళిక ప్రకటన

సిటీబ్యూరో, మే 27, (నమస్తే తెలంగాణ) : వచ్చే వర్షాకాలంలో శక్తి వంచన లేకుండా పనిచేయాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించిన ఆయన.. వర్షాకాలం ప్రణాళికను ప్రకటించారు. మరో వారం రోజుల్లో వర్షాకాలం ప్రారంభమయ్యే నేపథ్యంలో డైరెక్టర్లు మొదలుకొని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు అంతా అప్రమత్తంగా ఉండాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కలుషిత నీరు సరఫరా కాకుండా అందులో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సీవరేజీ ఓవర్ ఫ్లోను సీరియస్‌గా తీసుకుని ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. వివిధ అంశాలపై వచ్చే ఫిర్యాదులను అరగంటలో పరిష్కరించాలన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లోతో పాటు కలుషిత నీటి సరఫరా వంటి వాటిపై వచ్చే ఫిర్యాదులను అరగంటలో పరిష్కరించాలని ఆదేశించారు.

### మ్యాన్‌హోళ్లకు ఎరుపు రంగు వేయాలి..

వాటర్ హాట్ స్పాట్లు గుర్తించి, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మ్యాన్ హోళ్లకు సేఫ్టీ గ్రిల్స్ బిగింపు, ప్రమాదకర మ్యాన్ హోళ్ల వద్ద రెడ్ ఫ్లాగ్స్, సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వివరించారు. వర్షాకాలంలో కలుషిత నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ యంత్రాలను సమర్థంగా ఉపయోగించుకోవాలని ఎండీ సూచించారు .జలమండలి, జీహెచ్‌ఎంసీ 120 వాటర్ లాగింగ్ పాయింట్లను నిత్యం పర్యవేక్షించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. మంచి నీటి పైపులైన్ నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుండా సంబంధిత అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. ముంపునకు గురైన మ్యాన్‌హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రహదారుల మీద ఉన్న మ్యాన్‌హోళ్లకి ఎరుపు రంగు వేయాలని ఎండీ ఆదేశించారు. డీప్ మ్యాన్ హోళ్ల దగ్గర సీవరేజీ సూపర్ వైజర్లు ఉండేలా చూడాలన్నారు.




సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతున్న ఎండీ సుదర్శన్‌రెడ్డి

### కస్టమర్ కేర్ 155313కు సమాచారం ఇవ్వొచ్చు

జీహెచ్‌ఎంసీ, పోలీస్ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఎండీ సుదర్శన్ రెడ్డి సూచించారు. నగర ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్ హోళ్ల మూతలను తెరవకూడదని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా మ్యాన్ హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా.. జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 5,767 కిలో మీటర్ల సీవరేజీ నెట్ వర్క్ ఉండగా.. శివారు మున్సిపాలిటీల పరిధిలో 4,200 కిలో మీటర్లు ఉందని ఎండీ వివరించారు. జీహెచ్ఎంసీ, శివారు మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 6,34,919 మ్యాన్ హోళ్లు ఉండగా, అందులో డీప్ మ్యాన్‌హోళ్లు 63,221 ఉన్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 26,798, శివారు మున్సిపాలిటీల పరిధిలో 36,423 ఉండగా... జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న దాదాపు అన్ని డీప్ మ్యాన్‌హోళ్లకు ఇప్పటికే సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శివారు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న వాటికి గ్రిల్స్ బిగింపు పనులు ఊపందుకున్నాయన్నారు.

ఈ సమావేశంలో ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.



### ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ)

ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్.. వర్షాకాలంలో కీలకంగా వ్యవహరిస్తుంది. విపత్కర సమయాల్లో ఈ బృందం సహాయక చర్యలు అందిస్తుంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అక్కడికి చేరుకుని రక్షణ చర్యలు చేపడుతుంది. ఇది జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్ మెంట్ టీమ్‌తో కలిసి సమన్వయం చేసుకుని పనిచేస్తుంది.

### సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్ (ఎస్పీటీ)

ఇది జలమండలికి సంబంధించి ప్రత్యేక భద్రతా బృందం. వివిధ పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు పాటిస్తున్నారా లేదా అనేది పరిశీలిస్తుంది. అన్ని ఓ అండ్ ఎం సైట్లలో తనిఖీలు నిర్వహించి.. భద్రతా నియమాలు పాటించేలా చర్యలు తీసుకుంటారు. పని జరిగే ప్రదేశాల్లో సూచికలు ఏర్పాటు మొదలు.. జియో ట్యాగింగ్ వరకు పనులు చేస్తారు. డివిజన్‌కు ఒక బృందాన్ని కేటాయించారు.

### మాన్‌సూన్ మేనేజ్‌మెంట్ ప్లాన్

జీహెచ్‌ఎంసీ ద్వారా గుర్తించిన వాట్ లాగింగ్ పాయింట్స్, మ్యాన్‌హోల్స్ తదితర అంశాలతో క్షేత్రస్థాయిలో మేనజర్లు ఈ మాన్ సూన్ మేనేజ్ మెంట్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి. రోజు వారీ పరిధిలో పర్యటించి డైలీ సిచువేషన్ రిపోర్ట్ (డీఎస్ఆర్) తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలి. అలాగే వాటర్ లాగింగ్ పాయింట్ దగ్గర ఒక వ్యక్తిని నియమించి.. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

### మాన్‌సూన్‌లో జలమండలి ప్రత్యేక కార్యాచరణ

సెంట్రల్ సేఫ్టీ ప్రొటోకాల్ సెల్ (సీఎస్ పీఎస్)

మాన్ సూన్ పనుల పర్యవేక్షణకు జలమండలి 2022లో ప్రత్యేకంగా సెంట్రల్ సేఫ్టీ ప్రొటోకాల్ సెల్ ఏర్పాటు చేసింది. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ సెల్.. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఇందులో పెట్రోలింగ్ వాహనం, ఒక కానిస్టేబుల్, ఇద్దరు హోం గార్డులతో పాటు కమ్యూనికేషన్ సామగ్రి ఉంటుంది. ఈ సెల్ క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి వచ్చే రోజువారీ ఫిర్యాదులపై ఆడిట్, రిపోర్టుల పర్యవేక్షణ, పని ప్రాంతాల్లో భద్రతా చర్యలు పాటించేలా చూస్తుంది.

## పద్మ పురస్కారాలకు దరఖాస్తులు

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ) : వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డులను ప్రదానం చేయనున్నది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లాలోని సంబంధిత రంగాల్లో సేవలు అందించిన వారు దరఖాస్తులు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు 26 జనవరి 2025న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేయనున్నట్లు జిల్లా యువజన , క్రీడా అధికారి సుధాకర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన అభ్యర్థుల నుంచి కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్, టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, లిటరేచర్, విద్య, క్రీడలు సివిల్ సర్వీసెస్, ఇతర రంగాల్లో సాధించిన ప్రతిభను తెలియజేస్తూ..800 పదాలు మించకుండా దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఈ నెల 31న సాయంత్రం 5 గంటల లోపు హైదరాబాద్ జిల్లా అభ్యర్థులు, జిల్లా యువజన క్రీడా అధికారి కార్యాలయంలో, బీ-303, 3వ అంతస్తు, స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్ కలెక్టరేట్ కాంప్లెక్స్ లక్డీకాపూల్‌లో నాలుగు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్ సైట్ https//padmaawards.gov.inలో సంప్రదించాలని సూచించారు.


## విలేకరులు కావలెను

నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రిక

హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్

జిల్లాల్లో ఈ క్రింది ప్రాంతాల్లో పనిచేసేందుకు పార్ట్‌టైమ్ విలేకరులు కావలెను.

**గ్రేటర్ హైదరాబాద్**

1. గాజుల రామారం
2. గాంధీ ఆస్పత్రి
3. కూకట్‌పల్లి
4. రసూల్‌పుర
5. ఘట్‌కేసర్ రూరల్
6. సంతోష్‌నగర్
7. మహేశ్వరం
8. పహాడీషరీఫ్
9. చాంద్రాయణగుట్ట
10. గౌతమ్‌నగర్
11. అల్వాల్

**రంగారెడ్డి**

1. శంకర్‌పల్లి
2. కేశంపేట
3. కొందుర్గు
4. చౌదరిగూడ

**వికారాబాద్**

1. తాండూర్ టౌన్
2. వికారాబాద్ రూరల్
3. బంట్వారం
4. కోట్‌పల్లి
5. మోమిన్‌పేట

పరీక్ష తేది : మే 28 (2024) మంగళవారం

సమయం: మధ్యాహ్నం 2 గంటలకు

పరీక్షా కేంద్రం : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం బంజారాహిల్స్- హైదరాబాద్